ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శుక్రవారం 6 సెప్టెంబరు 2024



నేడు వందేభారత్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 5: విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను శుక్రవారం రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. రద్దయిన వాటిలో విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20708), విశాఖ-వందేభారత్ (20833), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20834) ఉన్నాయన్నారు. అలాగే ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) మళ్లింపు మార్గంలో నడుస్తున్నాయన్నారు.

ఉక్కుకు మరిన్ని చిక్కులు



తీవ్రమవుతున్న బొగ్గు కొరత

- మరో 36 గంటలు...

అదీ ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ నడపడానికి సరిపడా మాత్రమే నిల్వలు

- ఈలోగా సర్దుబాటు కాకపోతే ప్రమాదమేనని కార్మిక వర్గాల ఆందోళన
- బ్లాస్ట్ ఫర్నేస్ -2 కూడా షట్‌డౌన్
- ఢిల్లీ నుంచి ఉన్నతాధికారుల రాక
- మరోవైపు బొగ్గు దిగుమతికి పోర్టు మార్పుతో టన్నుకు రూ.400 అదనపు వ్యయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కష్టాలు రోజురోజుకూ అధికం అవుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ముడి పదార్థాల కొరతపై యాజమాన్యం చెబుతున్న మాటలు వాస్తవమా?, కాదా?...అనే విషయం తెలుసుకోవడానికి ఢిల్లీ నుంచి ఉక్కు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ, డిప్యూటీ డైరెక్టర్ శుక్రవారం ప్లాంటుకు వచ్చారు. బొగ్గు నిల్వలు నిజంగానే అడుగంటిపోయాయా?, ఇంకా ఎక్కడైనా ఉన్నాయా?...అని తెలుసుకోవడానికి యార్డులన్నీ తిరిగి పరిశీలించారు. నిల్వలు పూర్తిగా నిండుకోవడంతో అక్కడ బెడ్లను తవ్వితే కొంత బొగ్గు వస్తుందని దానిని ఉపయోగించుకోవాలని ప్లాంటు అధికారులకు సూచించారు. ఇటీవలె గంగవరం పోర్టులో కార్మికులు సమ్మె చేసినప్పుడు...ఇలాగే కొరత ఏర్పడితే బెడ్లన్నీ తవ్వి వచ్చిన బొగ్గును వాడేశామని, ఇప్పుడు తవ్వినా పెద్దగా ప్రయోజనం ఉండదని అధికారులు పెదవి విరుస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చినవారు ఉన్న వనరులనే సమర్థంగా వినియోగించుకోవాలని చెబుతున్నారే తప్ప కేంద్రం నుంచి అందించే సాయంపై మాట్లాడకపోవడం ఉద్యోగ, కార్మిక వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది.

పోర్టు మార్పుతో అదనపు వ్యయం

ప్లాంటు అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గంగవరం పోర్టుకు బొగ్గు నౌకలను తీసుకువస్తే పార్టీలు అటాచ్‌మెంట్లు తీసుకువస్తున్నాయనే ఉద్దేశంతో కొన్ని నౌకలను విశాఖపట్నం పోర్టుకు మళ్లిస్తున్నారు. అక్కడైతే ఎటువంటి అటాచ్‌మెంట్ ఉండదనే భావనతో అలా చేస్తున్నారు. కానీ దానివల్ల రవాణా వ్యయం టన్నుకు రూ.400 నుంచి రూ.500 పెరిగిపోతున్నది. గంగవరం పోర్టు అయితే నౌక నుంచి బొగ్గును దించిన వెంటనే కన్వేయర్ బెల్ట్ ద్వారా స్టీల్‌ప్లాంటుకు వచ్చేస్తుంది. అందుకోసం టన్నుకు సుమారు రూ.250 వసూలు చేస్తోంది. అదే విశాఖపట్నం పోర్టు అయితే బొగ్గును నౌక నుంచి దించిన తరువాత రైల్వే ఇచ్చే ర్యాకుల ద్వారా తెచ్చుకోవలసి ఉంటుంది. ర్యాకులకు బొగ్గును ఎక్కించడానికి చార్జీలు పడతాయి. విశాఖ పోర్టు నుంచి స్టీల్‌ప్లాంటుకు 30 కి.మీ. దూరమే అయినా రైల్వే నిబంధనల ప్రకారం మినిమం చార్జీ పేరుతో 100 కి.మీ. చార్జీ వసూలు చేస్తున్నారు. ఒక నౌకలో 80 వేల టన్నులు తెచ్చుకుంటే... దానిని తరలించడానికి రైల్వే రోజుకు రెండు ర్యాకులు మాత్రమే ఇస్తోంది. అలా ఆ సరకు మొత్తం ప్లాంటుకు తీసుకువెళ్లాలంటే పది రోజులు పడుతుంది. అన్ని రోజులకు పోర్టులో స్టాక్ యార్డుకు అద్దె కట్టాలి. ఇలా వచ్చిన బొగ్గును ప్లాంటులో ట్రిప్లింగ్ విధానంలో అన్‌లోడ్ చేస్తారు. అది మొండికేస్తే మాన్యువల్‌గా చేయాల్సి వస్తుంది. దానికి మళ్లీ కాంట్రాక్ట్ వర్కర్లను పెట్టుకోవాలి. ఇవన్నీ చూసుకుంటే టన్నుకు రూ.400 నుంచి రూ.500 అదనపు భారం పడుతోంది. అంటే నౌకకు ఎలా లేదన్నా రూ.2 కోట్లు అదనపు వ్యయం అవుతోంది. వీధిలో కిరాణా దుకాణంలో చేసిన అప్పు తీర్చలేక పక్కవీధికి వెళ్లి అక్కడ పది రూపాయల వస్తువును రూ.12 కొన్నట్టుగా మారింది స్టీల్ ప్లాంటు యాజమాన్యం తీరు. గంగవరం పోర్టులో అటాచ్‌మెంట్లు తెస్తున్నారని...విశాఖపట్నం పోర్టుకు వెళితే అక్కడ నౌకకు రూ.2 కోట్లు అదనంగా పెట్టాల్సి వస్తోంది. ఇప్పుడు అక్కడ కూడా ఒక పార్టీ అటాచ్‌మెంట్ తీసుకురావడం గమనార్హం.

సెయిల్ ఒత్తిడి

ఇటీవల గంగవరం పోర్టు కార్మికుల సమస్య తలెత్తినప్పుడు బొగ్గు కొరత రాగా సెయిల్ 70 వేల టన్నులు సర్దుబాటు చేసింది. దానిని తిరిగి ఇవ్వలేదు. ఇప్పుడు అది ఇవ్వాలంటూ సెయిల్ అధికారులు స్టీల్‌ప్లాంటుకు గురువారం వచ్చారు. అక్కడ బొగ్గు

... మిగతా 6వ పేజీలో

పందిళ్ల అనుమతులకు

కలెక్టరేట్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

వినాయక చవితి పందిళ్లకు అనుమతులు ఇచ్చేందుకు ఆఫ్‌లైన్‌లో గురువారం కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మంగళవారంతో ముగించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టరేట్ వర్గాలు సూచించాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వెబ్‌సైట్ మొరాయించడం, అనుమతుల్లో తాత్సారంపై 'వినాయక పందిళ్లకు అనుమతులపై గందరగోళం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ తిరిగి ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా ఆన్‌లైన్‌లో ఇప్పటివరకూ రెండు వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. పందిళ్ల ఏర్పాటుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పోలీస్ శాఖ పరిశీలించి నిరభ్యంతర పత్రం మంజూరుచేస్తుందని ఆయన తెలిపారు.

'బే వాచ్'లో అనధికార కాటేజీలు



బే వాచ్‌లో అనుమతి లేకుండా నిర్మించిన కాటేజీలను పరిశీలిస్తున్న అధికారిణి జ్ఞానవేణి

ఏపీటీడీసీ బార్ లైసెన్స్ దుర్వినియోగం

పర్యాటక శాఖ అధికారిణి తనిఖీలో గుర్తింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

భీమిలి బీచ్‌రోడ్డును ఆనుకొని తొట్లకొండ ఎదురుగా ఏపీటీడీసీకి చెందిన 'బేవాచ్'లో లీజుదారుల అక్రమాలు బయటపడ్డాయి. దానిని లీజుపై నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జ్ఞానవేణిని కలెక్టర్ ఆదేశించారు. విచారణ సమయంలో ఫిర్యాదీని కూడా పిలవాలని కలెక్టర్ సూచించడంతో మూర్తియాదవ్ హాజరయ్యారు. కేవలం రెస్టారెంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా మాత్రమే వారికి నిర్వహణ కోసం లీజుకు ఇవ్వగా రిసార్ట్ తరహాలో ప్రత్యేకంగా గదులు నిర్వహించి, అందులో

... మిగతా 6వ పేజీలో

నగరంలో 150కుపైగా కొత్త రేషన్ డిపోలు

- 600 నుంచి 650 కార్డులకు ఒక డిపో

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న రేషన్ డిపోల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నగరంలో కొత్తగా 150 నుంచి 170 డిపోలు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 642 డిపోలను రేషనలైజ్ చేసి... ఒక్కో డిపో పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామీణ ప్రాంతంలో డిపోకు 400 నుంచి 450, పట్టణాల్లో 500 నుంచి 550, నగరాల్లో 600 నుంచి 650 కార్డులు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ జిల్లాలో 5.29 లక్షల కార్డులకు 642 డిపోలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో నాలుగు మండలాలను మినహాయించి చూస్తే నగరంలో మూడు సర్కిళ్ల(గాజువాక నుంచి మధురవాడ వరకు) పరిధిలో సుమారు 200 డిపోల వరకు 1000 కార్డులు, మరో 200 డిపోలకు 1000 నుంచి 1800 కార్డులు ఉన్నాయి. డిపోల్లో కార్డులు అధికంగా ఉండడంతో రేషన్ సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త డిపోలు ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. తాజా ఉత్తర్వులతో జిల్లాలో కార్డుల సంఖ్య మేరకు కొత్త డిపోల ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

వైసీపీ నేతల డ్రామా

- అధికారంలో ఉండగా అడ్డగోలుగా ఆస్తి పన్ను పెంపు
- చెత్త సేకరణపై కొత్తగా పన్ను విధింపు
- నాడు కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలు వ్యతిరేకించినా మందబలంతో ఏకపక్షంగా తీర్మానాలు
- నగరవాసుల వద్ద ముక్కుపిండి మరీ పన్నుల వసూలు
- ఇప్పుడు అధికారం పోగానే యూ టర్న్
- ఆస్తి పన్ను తగ్గించాలని, చెత్త పన్ను రద్దు చేయాలని కోరుతూ వైసీపీ ఫ్లోర్ లీడర్ వినతిపత్రాలు
- చెత్త పన్ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 10న జరగనున్న కౌన్సిల్‌లో తీర్మానం చేసేందుకు ఇప్పటికే కూటమి నేతలు, కార్పొరేటర్ల నిర్ణయం
- ఆ విషయం తెలిసే నాటకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నేతలు, కార్పొరేటర్లు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నగరంలో ఆస్తి పన్ను పెంచేశారు. అదేవిధంగా చెత్త సేకరించి నందుకుగాను యూజర్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ రెండు అంశాలపై నాడు కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీతోపాటు వామపక్షాల కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపినా పట్టించుకోకుండా...సంఖ్యా బలం ఉంది కదా అని తీర్మానాలు ఆమోదించేసుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో జీవీఎంసీలో కూడా సీన్ మారిపోయింది. వైసీపీ మెజారిటీ కోల్పోయింది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పదుల సంఖ్యలో తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరిపోయారు. అందుకే ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పరాజయం పాలైంది. అధికారంలో ఉన్నప్పుడు జనంపై ఎడాపెడా పన్నులు పెంచి, కొత్త పన్నులు విధించిన వైసీపీ కార్పొరేటర్లు ఇప్పుడు పన్నులను తగ్గించాలంటూ కొత్త నాటకం మొదలెట్టారు.



చెత్త పన్ను రద్దు చేయాలని మేయర్‌కు గురువారం వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

జీవీఎంసీలో వార్షిక అద్దె ప్రాతిపదికన ఆస్తి పన్ను విధానం అమలులో ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల పేరుతో ఆస్తి మూలవిలువ ఆధారంగా పన్ను వసూలుచేసేలా చట్ట సవరణ చేసింది. దీని ప్రకారం ఆ ప్రాంతంలో ఉన్న భూమి విలువతోపాటు ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చును ఆస్తి మూలవిలువగా పరిగణిస్తారు. అందులో 0.13 శాతాన్ని ఆస్తిపన్ను కింద జీవీఎంసీకి ఇంటి యజమాని చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల ఆస్తి పన్ను ఒకేసారి రెట్టింపునకుపైగా పెరిగింది. ఆ మొత్తాన్ని ఒకేసారి వసూలు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని...ఏటా 15 శాతం మించకుండా ఆస్తివిలువ ఆధారంగా లెక్కించిన మొత్తానికి సమానమయ్యేంత వరకూ పెంచుకుంటూ వెళ్లాలని జీవీఎంసీని ఆదేశించింది. దీనికోసం జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి కావడంతో మూడేళ్ల కిందట ప్రతిపాదన తయారుచేసి చర్చకు పెట్టారు. కొత్తచట్టం ప్రకారం ఆస్తి పన్ను వసూలుచేస్తే నగరవాసులపై భారం పెరిగిపోతుందని టీడీపీ సహా విపక్షాల కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తంచేశారు. పాతవిధానాన్నే కొనసాగించాలని పట్టుబట్టారు. అయినప్పటికీ కౌన్సిల్‌లో వైసీపీకి సంఖ్యాబలం ఉండడంతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి విపక్షాల అభ్యంతరాల మధ్యనే ఆస్తి పన్ను చట్టసవరణ తీర్మానాన్ని ఆమోదించారు.

అలాగే నగరాల్లో చెత్త సేకరణ, నిర్వహణ శాస్త్రీయంగా జరగడంతోపాటు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఘనవ్యర్థాల నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందించిందంటూ యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నివాసాల నుంచి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, తోపుడుబండ్లు నుంచి నెలకు రూ.200 నుంచి రూ.15 వేలు వరకూ వసూలుచేయాలని మూడున్నరేళ్ల కిందట జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. దీనిపై టీడీపీ సహా విపక్షాల కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలంటూ ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియాన్ని

... మిగతా 6వ పేజీలో

మండుతున్న నిత్యావసరాల ధరలు

రైతుబజారులో కిలో ఉల్లి రూ.50, బయట రూ.70

- బంగాళాదుంపలు రూ.29, బయట రూ.40
- వెల్లుల్లి రూ.280, బయట రూ.360
- దిగిరాని పప్పుల ధరలు
- కందిపప్పు కిలో రూ.230



విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు మండిపోతున్నాయి. వరుస వర్షాలతో పంటలకు నష్టం కలగడంతో ఆకుకూరలు, కొన్నిరకాల కూరగాయల లభ్యత తగ్గిపోయింది. బయట నుంచి వచ్చే ఉల్లి, బంగాళాదుంప, టమాటాకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వాటి ధరలు పెరుగుతున్నాయి. రైతుబజార్లలో ఉల్లి దొరకడం గగనంగా మారింది. నాణ్యత లేని సరకే దొరుకుతోంది. రేటు పెరగడమే దీనికి కారణం. మహారాష్ట్ర నుంచి ఉల్లి తెప్పిస్తారు. అక్కడ రేట్లు పెరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వమే రాయితీ ధరపై విక్రయిస్తోంది. గత రెండు వారాల నుంచి ఉల్లి ధరలు రైతుబజార్లలో రూ.36 నుంచి పెరుగుతూ ఇప్పుడు రూ.50కి చేరాయి. బయట మార్కెట్‌లో కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు తక్కువ రేటు నిర్ణయిస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదంటూ డ్వాక్రా గ్రూపులు నాణ్యమైన ఉల్లిని రైతుబజార్లకు తేవడం లేదు. కిలోకు రూ.50 పెట్టినా కుళ్లినవే ఎక్కువ ఉంటున్నాయి. కొంచెం రేటు పెంచైనా సరే మంచి సరకు విక్రయించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇక టమాటా ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. వారం రోజుల క్రితం వరకు బయట ఆటోల్లో నాలుగు కిలోలు రూ.100 చొప్పున విక్రయించారు. ఇప్పుడు రైతుబజారులోనే కిలో రూ.28 ధర పెట్టారు. ఇంకా పెరుగుతుందని అంటున్నారు. బంగాళాదుంపల ధర దిగి రావడం లేదు. రైతుబజారులో కిలో రూ.29, బయట రూ.40 చొప్పున అమ్ముతున్నారు. వెల్లుల్లి ధరలు ఇటీవల బాగా పెరిగాయి. రైతుబజారులో కిలో రూ.280 కాగా బయట రూ.360 చొప్పున విక్రయిస్తున్నారు. కొత్తిమీర, తోటకూర, పాలకూర, గోంగూర తదితర ఆకుకూరల ధరలు పెరిగాయి. ఏదైనా పది రూపాయలకు ఇవ్వడం లేదు. ఇరవై అయితే ఇస్తామని కరాఖండిగా చెబుతున్నారు. పప్పుల ధరలు కూడా పెరుగుతున్నాయి. కందిపప్పు ధర పెరిగిందని నెల రోజుల క్రితం కిలో రూ.150 చొప్పున అధికారులు రైతుబజార్లలో విక్రయించారు. దీనివల్ల బయట ధరలు తగ్గుతాయని భావించారు. ఫలితం లేదు. బయట కిలో రూ.230కి అమ్ముతున్నారు. మినపప్పు రూ.160, పెసరపప్పు రూ.150 ఇలా అన్నీ పెరిగిపోయాయి.

కదలని ఏసీపీ

- బదిలీ అయ్యి రెండు వారాలైనా రిలీవ్ కాని వైనం
- నగరంలోనే కొనసాగేందుకు యత్నాలు
- పోలీస్ వర్గాల ఆశ్చర్యం



విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్‌లో ఒక ఏసీపీ వ్యవహారశైలి వివాదాస్పదమవుతోంది. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను గత నెల 17న బదిలీ చేసింది. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ నగరాన్ని విడిచివెళ్లేందుకు ఇష్టపడని సదరు ఏసీపీ ఇంకా అదే పోస్టులో కొనసాగుతుండడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీలకమైన సబ్ డివిజన్‌కు ఏసీపీగా పనిచేస్తున్న ఒక అధికారి పనితీరుపై ఎప్పటినుంచో విమర్శలు ఉన్నాయి. సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు వచ్చే సివిల్ కేసులు, ఇతర ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫిర్యాదులను తాను సొంతంగా నియమించుకున్న సిబ్బంది ద్వారా తెలుసుకుని ఇరుపార్టీలను తన కార్యాలయానికి పిలిపించుకుని సెటిల్‌మెంట్లు చేశారంటూ సీఐలు కొందరు ఆరోపించారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమవ్వడంతో ప్రస్తుత సీపీ శంఖబ్రతబాగ్చితోపాటు అంతకుముందు సీపీగా పనిచేసిన రవిశంకర్ అయ్యన్నార్ కూడా విచారణ జరిపించారు. విచారణలో సదరు ఏసీపీపై ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు ఆయన్ను బదిలీ చేస్తూ గత నెల 17న ఉత్తర్వులు జారీచేశారు. అయితే సదరు ఏసీపీ మాత్రం ఇంతవరకూ రిలీవ్ కాలేదు. కొద్దిరోజుల కిందట డీజీపీ ద్వారకా తిరుమలరావు

... మిగతా 6వ పేజీలో

భారీ వర్షం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం సాయంత్రం నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. ఉదయం మేఘాలు ఆవరించి వాతావరణం చల్లగానే ఉంది. పది గంటల తరువాత ఎండ తీవ్రత పెరిగింది. ఉక్కపోత కూడా తోడైంది. అయితే మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఒక్కసారిగా వాతావరణం మారింది. భారీగా మేఘాలు ఆవరించి వర్షం ప్రారంభమైంది. పెందుర్తిలో 27.5, అప్పన్నపాలెంలో 26.5, గాజువాకలో 23.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం నగరంలో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

గురు పూజోత్సవం



వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో గురు పూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా 82 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. - వార్త 7లో

రాయనపాడు స్టేషన్‌లో హాల్ట్ తొలగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 5: భారీ వర్షాల కారణంగా రాయనపాడు స్టేషన్ వద్ద నీరు నిలిచిపోవడం, ట్రాక్ దెబ్బతిన్న నేపథ్యంలో పలు రైళ్లకు రాయనపాడు స్టేషన్‌లో హాల్ట్‌ను తాత్కాలికంగా ఎత్తివేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.గురువారం విశాఖ నుంచి మహబూబ్ నగర్ వెళ్లే 12861 నంబరు గల ఎక్స్‌ప్రెస్, మహబూబ్‌నగర్ నుంచి విశాఖ వచ్చే 12862 నంబరు గల రైలు, నాందేడు నుంచి విశాఖ వచ్చే 22812 నంబరు గల రైళ్లు రాయనపాడు స్టేషన్‌కు వెళ్లవని పేర్కొన్నారు.

మత్స్య ఎగుమతులపై నేడు సదస్సు

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు పెంచడానికి గల అవకాశాలపై చర్చించేందుకు వాటాదారులతో శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ గురువారం తెలిపారు. మత్స్యకారులు, చేపల పెంపకందారులు, ఎగుమతిదారులు, పరిశోధకులు, విధాన రూపకర్తలతో వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సదస్సుకు కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, సహాయమంత్రి జార్జ్ కురియన్‌లతో పాటు మత్స్య శాఖకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.









విశ్వనాథం దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థి ఉన్నతిని కోరుకునేది గురువే

సీతమ్మధార, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా గురువారం అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువు లేని విద్య రాణించదని, ప్రతీ విద్యార్థి తమ కంటే గొప్ప వారు కావాలని ఉత్తమ గురువులు కోరుకుంటారని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ అంబేద్కర్, అబ్దుల్ కలాం ప్రపంచ మేధావులు కావడానికి వారి గురువులే కారణమని తెలిపారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఈశ్వరమ్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ గిరిష్ కుమార్, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. మంజులను అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ మంజుల మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికను అలవరచుకుని, శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: స్థానిక 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ విశ్వనాథం, మరో తెలుగు ఉపాధ్యాయుడు ఎంపీ ధర్మారావులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మి నరస, సీతమ్మధార ఎంఈఓలు రామారావు, బాలామణి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. భవిత కేంద్రంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు.

డాబాగార్డెన్స్ : జిల్లా స్థాయి గురు పూజోత్సవంలో జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్ రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్‌ను జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

అల్లిపురం: అల్లిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో రైల్వేస్కూల్, విజ్ఞాన భారతి, అంగన్వాడీలలో బోధిస్తున్న సుమారు 30మంది టీచర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి టూటౌన్ సీఐ తిరుమలరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబరు గంట్ల శ్రీనుబాబు హాజరై సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక జూబ్లీ పాఠశాలలోనూ, జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో అధ్యాపకులను ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ సన్మానించారు.

ఆర్పీపేట (కంచరపాలెం): ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని, అవార్డులు మరింత బాధ్యత పెంచుతాయని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారులు ఎ.సోమేశ్వరరావు, డి.దివాకర్ పేర్కొన్నారు. మండలంలో 32 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. మర్రిపాలెం జ్యోతినగర్‌లో గల మండల వనరుల కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో మండల ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు. ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ప్రిన్సిపల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐల్లో గురువులను ఘనంగా సత్కరించారు.

పూర్ణామార్కెట్: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని, ఉపాధ్యాయులను సత్కరించడం గొప్ప విషయమని దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. గ్రేటర్ 35వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, సెప్టెంబరు 5: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ సత్యం ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామాటాకీస్ తులసిపేట, వినాయక్ నగర్, అంబేడ్కర్ భవన్, బుల్లయ్య కళాశాల, స్పెన్సర్ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతం, డీఎంహెచ్ఓ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మహారాణిపేట, సెప్టెంబరు 5: మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మైలుపల్లి లక్ష్మణరావు అన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మత్స్యపరిశ్రమకు జవసత్వాలు కల్పించి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. మత్స్య పరిశ్రమకు రావలసిన రాయితీలు వేట సాగిస్తున్న బోట్లకు రక్షణ పరికరాలు సమకూర్చటం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించేందుకు పాటుపడతామని తెలిపారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా సురపతి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా గరికిన పరశురాముడు, మన్నెం బాలాజీ, వాసుపల్లి రాజు తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలా గురువులు, పి.సి.అప్పారావు, పేర్ల విజయ్‌చందర్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.

జీతం బకాయిల చెల్లింపునకు డిమాండ్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 5: తమ నాలుగు నెలల జీతం బకాయిలు చెల్లించాలంటూ ఘోషాస్పత్రి వద్ద సెక్యూరిటీ గార్డులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జీతాలు సక్రమంగా అందక సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను నడపడం దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. నిబంధనల ప్రకారం రూ.12 వేలు ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ రూ.9 వేలు మాత్రమే చెల్లించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

విశాఖ జిల్లాలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 5 : జిల్లాలోని క్వారీ రీచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం కార్యదర్శి కర్రి వెంకటరమణ, అధ్యక్షుడు మద్దిల వెంకట రమణ, కోశాధికారి నమ్మి మాధవరావు కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుమారు వెయ్యి లారీలతో ఇసుకను రవాణా చేస్తూ పది వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ఐదు నెలలుగా శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇసుక రీచ్‌లు ప్రారంభించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారులు, లారీ యజమానులకు ఇసుక పంపిణీ విధానం ప్రభుత్వం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు బొట్టా సురేష్, కొయ్య శ్రీను, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

9న నీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదిన టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్లు, లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు తెలిపారు. యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని తాగునీటి సరఫరా, యూజీడీ, పంప్‌హౌస్‌లతోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అన్‌స్కిల్డ్ వారికి నెలకు రూ.25,410, సెమీ స్కిల్డ్ వారికి రూ.29,610 వేతనం చెల్లించేలా గత ఏడాది కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. తొమ్మిది అధికారుల కమిటీ కూడా ప్రజారోగ్యం విభాగంలో పారిశుధ్య సూపర్‌వైజర్లు, వర్కర్‌కమ్ డ్రైవర్లని వివిధ కేటగిరీలుగా విభజించి వారికి వేతనాలను కూడా నిర్ణయిస్తూ నివేదిక అందజేసినా ఫలితం లేదన్నారు.

'దేశానికే ఆదర్శం కేరళ వామపక్ష ప్రభుత్వం'



ప్రసంగిస్తున్న కేరళ మాజీ మంత్రి శైలజ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 5 : దేశానికే కేరళ వామపక్ష ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిందని ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ కేకే శైలజ అన్నారు. 'కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఐఎం జిల్లా కమిటీ నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా ఆమె విచ్చేశారు. తొలుత తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు రుద్రరాజు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేరళలో కోవిడ్ సమయంలో వామపక్ష ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో తీసుకున్న వైఖరి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు పొందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వామపక్ష పార్టీలను, ప్రభుత్వాలను కూల్చడమే లక్ష్యంగా చేసుకుందన్నారు. త్రిపుర, బెంగాల్‌లో నేడు వామపక్ష ప్రభుత్వాలు లేకపోవడంతో అక్కడ ప్రజలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో చూస్తున్నామన్నారు. పోలీస్ బలగాలతో ప్రజలను, పోరాటాలను అణిచి వేస్తున్నారని ఆరోపించారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి డా.బి.గంగారావు అధ్యక్షత వహించిన సమావేశంలో కార్యదర్శి జగ్గునాయుడు, ప్రభావతి, కుమార్, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

వినియోగదారుల్లో చైతన్యం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ దాశరధి

మురళీనగర్, సెప్టెంబరు 5 ; విద్యార్థుల నుంచి సాధారణ పౌరుల వరకు తమ హక్కుల పట్ల సరైన అవగాహన ఉండాలని సీఐ దాశరధి సూచించారు. వినియోగదారుల హక్కుల కమిషన్ మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి వస్తువు, ఆహార పదార్థాల్లో కనిపిస్తున్న నకిలీ ఉత్పత్తులు, నాణ్యత లేమి విషయంలో ప్రశ్నించాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు పొందాలంటే వినియోగదారుల్లో చైతన్యం అవసరమన్న ఫోరం ప్రతినిధుల సూచనలు పాటించాలన్నారు. తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ విద్యార్థులకు ప్రాథమిక అవగాహన సూత్రాలు తెలిపారు. ప్రిన్సిపల్ రాజేష్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్స్ ఫోరం నుంచి ఇక్బాల్, శరత్‌చంద్ర, విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

మర్రిపాలెం, సెప్టెంబరు 5: చిన్నారుల ఆరోగ్యంపై అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. గురువారం ఆయన గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్‌దరి శ్రీరామ్‌నగర్‌లోని శిశుగృహ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ రమణకుమారి, శిశుగృహ మేనేజర్ సుజాత, ఎంఎస్‌కె రాజన భవాని పాల్గొన్నారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు

వరద బాధితులకు రూ.30 లక్షల విరాళాలు

మహారాణిపేట, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖ వాల్తేర్ క్లబ్ సభ్యులు, ఎస్ కోట నియోజకవర్గంలోని వివిధ విద్యా సంస్థలు, ఇతర సంస్థలు రూ.21,87,116 లక్షలు విరాళంగా ప్రకటించాయి. సంబంధిత చెక్కులను విశాఖ ఎంపీ శ్రీభరత్, ఇతర టీడీపీ నాయకులు, వాల్తేర్ క్లబ్ సభ్యులు గురువారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలసి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు గండిబాబ్జి, పట్టాభిరామ్, గంపకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: సీఎం సహాయ నిధికి వీఎంఆర్‌డీఏ, వీకేపీసీపీఐఆర్-యుడీఏ ఉద్యోగులు ఒకరోజు బేసిక్ పే మొత్తం రూ.6.76 లక్షలను విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కమిషనర్ విశ్వనాథన్‌కు సెక్రటరీ కీర్తి అందజేశారు. అలాగే వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఈవో లక్ష్మారెడ్డి, సీఈ భవానీశంకర్, సీపీవో హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డుకు చెందిన బమ్మిడిపాటి కల్యాణి తన వంతు సాయంగా రూ. లక్ష చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని. వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌కు అందజేశారు.

అల్లిపురం: వరద బాధితులను ఆదుకునేందుకు విశాఖ జిల్లా సీపీఐ తరఫున తొలివిడతగా రూ.లక్ష సేకరించి రాష్ట్ర కార్యవర్గానికి పంపినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. నగరంలోని పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల నుంచి విరాళాలు సేకరించామన్నారు.

ఉక్కుకు మరిన్ని చిక్కులు

... 5వ పేజీ తరువాయి

యార్డులను చూసి నివ్వెరపోయారు. ఇంత ఖాళీ యార్డులతో ప్లాంటును ఎలా నడుపుతున్నారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేసి వెళ్లిపోయారు. బొగ్గు కొరత కారణంగా ఒకటో నంబరు బ్లాస్ట్ ఫర్నేస్‌ను చాలా రోజుల క్రితమే పూర్తిగా మూసేశారు. గత 15 రోజుల నుంచి కొన్ని రోజులు బీఎఫ్-2, మరికొన్ని బీఎఫ్-3 నడుపుకుంటూ వస్తున్నారు. గత రెండు రోజుల నుంచి బీఎఫ్-2 కూడా షట్‌డౌన్ చేశారు. ఇప్పుడు బీఎఫ్-3 ఒక్కటి నడపడానికి కూడా బొగ్గు పూర్తిగా లేదు. కేవలం 36 గంటలు దానిని నడపడానికి సరిపడా బొగ్గు మాత్రమే ఉంది. ఈలోగా ఏమైనా సర్దుబాటు కాకపోతే ప్రమాద ఘంటికలు మోగినట్టేనని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వైసీపీ నేతల డ్రామా

... 5వ పేజీ తరువాయి

చుట్టుముట్టారు. అయినప్పటికీ కౌన్సిల్‌లో వైసీపీకి సంఖ్యాబలం ఉండడంతో మేయర్ ఏకపక్షంగా తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం యూజర్ చార్జీలు వసూలు బాధ్యతను వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. కొన్నిచోట్ల సామాజిక పెన్షన్ల నుంచి యూజర్ చార్జీలను మినహాయించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విసిగిపోయిన జనం ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించారు. నగర పరిధిలో వైసీపీకి ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కలేదు. ఇక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా చెత్త పన్ను రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల పదో తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయాలని కూటమి ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఆ మేరకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ విషయం వైసీపీ నాయకులు తెలుసుకున్నట్టున్నారు. ఆస్తిపన్నును తిరిగి పాతవిధానంలోనే వసూలుచేయడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని, చెత్త వసూలుపై యూజర్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ జీవీఎంసీలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు గురువారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకుల పోకడలు చూసి నగరవాసులు విస్తుపోతున్నారు. పన్నుల పెంపుతో ప్రజలు ఇబ్బందిపడుతున్న విషయం అధికారం కోల్పోయిన తరువాత గుర్తొచ్చిందా?...అని ప్రశ్నిస్తున్నారు.

కదలని ఏసీపీ

... 5వ పేజీ తరువాయి

నగరానికి వచ్చినప్పుడు సదరు ఏసీపీ కనిపించగా సీపీ శంఖబ్రతబాగ్చి 'ఇంకా ఎందుకు రిలీవ్ కాలేదంటూ' ప్రశ్నించినట్టు పోలీసులు చెబుతున్నారు. అయినప్పటికీ సదరు ఏసీపీ మాత్రం నగరంలోనే కొనసాగేందుకు తన వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. బదిలీ అయినప్పటికీ తాను ఇక్కడే కొనసాగుతానంటూ తన సబ్‌డివిజన్ పరిధిలోని వ్యాపారుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీపీ శంఖబ్రతబాగ్చి ఇప్పటికైనా ఆయనపై దృష్టిసారించాలని సిబ్బంది కోరుతున్నారు.

'బే వాచ్'లో అనధికార కాటేజీలు

... 5వ పేజీ తరువాయి

బెడ్లు వేసి, రోజుకు రూ.4వేలు చొప్పున పర్యాటకులకు అద్దెకు ఇస్తున్నట్టు విచారణలో తేలిసింది. ఆ గదుల కోసం అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్టు బయటపడింది. ఏపీటీడీసీ ఇచ్చిన నిర్మాణాల కంటే రెట్టింపు సంఖ్యలో అనధికార నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. అదే విధంగా మద్యం విక్రయాల కోసం ఏపీటీడీసీ లైసెన్స్ తీసుకుంటే కేవలం రూ.6 లక్షలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. అదే లీజుదారులు తీసుకుంటే రూ.70 లక్షలకు పైగా కట్టాలి. అందుకని ఏపీటీడీసీయే లైసెన్స్ తీసుకుంది. కానీ మద్యం విక్రయాలు మాత్రం లీజుదారులు చేస్తున్నారు. ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా పర్యాటక శాఖాధికారిణి వాటి ఫొటోలు తీసుకొన్నారు. అన్నింటిని నివేదికలో పొందుపరుస్తామని ఫిర్యాదీకి తెలిపారు.

'మాల మాదిగలు కలిసి ఉండాలన్నదే లక్ష్యం'

మహారాణిపేట, సెప్టెంబరు 5: మాల మాదిగలు కలసి ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ విశ్వ విద్యాలయం మాజీ డీన్, దక్షిణ బారత సిద్ధాంత కర్త గాలి వినోద్ కుమార్ అన్నారు గురువారం సమావేశమందిరంలో బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధమేనా? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తొలుత డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ దళితుల సమస్య పరిష్కారం కాకూడదనేదే రాజకీయ పార్టీల ఆలోచన అని మండిపడ్డారు. వర్గీకరణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమస్య అని, కులాల మధ్య వ్యత్యాసం లేదని అన్నారు. సమస్యపై ముఖ్యమంత్రులిద్దరు 371 డి ప్రకారం జోన్‌డిలో పెట్టాలని కేంద్రానికి సిఫారసు పంపితే సరిపోతుందన్నారు సుప్రీంకోర్టుది తీర్పు కాదని లోటు పాట్లు ఉన్నాయని, ఇది బీజేపీ ఆర్ఎస్ఎస్ కుట్ర అని అన్నారు అంబేద్కర్ విధానానికి వ్యతిరేకంగా వెళ్లటం సరికాదన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు హరిబాబు, రాజేంద్ర, రేణుకుమార్, వేణుగోపాల్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

సింహచలం, సెప్టెంబరు 5 : అడవివరంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సింహాచలం సమీపంలోని ప్రియాగార్డెన్స్‌లో మంగవిల్లి వెంకట కోటేశ్వరరావు (32) తల్లిదండ్రులు అప్పలరాజు, అరుణతో కలిసి నివసిస్తున్నాడు. అతను గోపాలపట్నంలోని ఓ జ్యూవెలరీ షాపులో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు సింహాచలం కొండపై ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తుంటారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బయటకు వెళ్తానని చెప్పి, కోటేశ్వరావు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. గురువారం ఉదయం వరకూ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఈక్రమంలో అడవివరం నుంచి శొంఠ్యాం వెళ్లే రహదారిలో ఏఎంజీ కాలనీ వద్ద కోటేశ్వరరావుకు చెందిన బైక్ పార్కింగ్ చేసి ఉండడంతో ఆ పరిసర ప్రాంతంలో గాలించారు. రహదారికి కాస్త దూరంలో ఉన్న చెరువులో మృతదేహం తేలియా డుతూ కనిపించడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నించే తత్వంతో విద్యార్థులను తీర్చిదిద్దాలి



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

- ▸▸ బట్టీ విధానంతో కొరవడుతున్న సృజనాత్మకత
- ▸▸ మంచి ఉపాధ్యాయులు విద్యార్థుల మదిలో నిలిచిపోతారు
- ▸▸ ఉపాధ్యాయుల దినోత్సవంలో విశాఖ ఎంపీ శ్రీభరత్
- ▸▸ 82 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రశ్నించే తత్వం, ఆలోచనా తత్వం వచ్చేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. బట్టీ పట్టే విద్యా విధానం వల్ల విద్యార్థులలో సృజనాత్మకత, కొత్త ఆలోచనలు కొరవడుతున్నాయన్నారు. గురువారం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీభరత్ తొలుత జ్యోతి ప్రజల్వన చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళలుర్పించారు. అనంతరం శ్రీభరత్ మాట్లాడుతూ దేశంలో 60 శాతం మంది 30 ఏళ్లలోపు యువకులేనని పేర్కొంటూ.. వారిలో నైపుణ్యం కొరవడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదల, నాయకత్వ లక్షణాలు అలవడేలా విద్యా ప్రమాణాలు పెరగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, గత ఐదేళ్లల్లో రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు తగ్గినట్టు మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చెప్పిన విషయాన్ని ఎంపీ ప్రస్తావించారు. మంచి బోధన ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెరుగుతారన్నారు. త్వరలో విశాఖ పార్లమెంటు పరిధిలో ప్రభుత్వ పాఠశాల లను సందర్శిస్తానన్నారు. మంచి ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థుల మదిలో నిలిచిపోతారన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ దేశానికి మంచి విద్యార్థులను అందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండాలే టీచర్లు తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. తనను వేకువజాము మూడు గంటలప్పుడు టీచర్ బావి గట్టుమీద కూర్చోబెట్టి చదివించారని గుర్తు చేసుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఏ రంగంలోనైనా రాణించాలంటే అది కేవలం ఉపాధ్యాయులు అందించే విద్య ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సమగ్రశిక్షా అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, చినగదిలి ఎంఈవో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 82మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

'ఉక్కు సీఎండీపై చర్యలు తీసుకోవాలి'

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 5: కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉక్కు యాజమాన్యం చేతులు కలిపి కర్మాగారాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు కుట్ర జరుగుతుందని, ఇందుకు కారణమైన సీఎండీపై తగిన చర్యలు తీసుకోవాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థకు కావాల్సిన ముడిసరకు విషయంలో ఉక్కు యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్లాంట్ విషయంలో స్పందించాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

అగనంపూడి, సెప్టెంబరు 5: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, తదితర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులో చోటుచేసుకుని భారీ వర్షం కురిసింది. నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో మురుగు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సింహాచలం రైల్వే స్టేషన్ భద్రతపై పోలీసుల పరిశీలన

గోపాలపట్నం, సెప్టెంబరు 5: సింహాచలం రైల్వే స్టేషన్ భద్రతపై ఆర్పీఎఫ్, గోపాలపట్నం పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా గోపాలపట్నం సీఐ సురేశ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత గురువారం స్టేషన్‌ను పరిశీలించారు. ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను తిలకించారు. గతంలో ఈ స్టేషన్‌లో అత్యాచారం, కిడ్నాప్‌లు, చైన్‌స్నాచింగ్‌లు, గంజాయిరవాణా వంటి పలు నేరాలు జరిగినందున అటువంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు చర్చించారు. స్టేషన్ లోపల, బయట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డకట్ట వేసేందుకు, తదితర అంశాలపై చర్చించుకున్నారు.

వరద బాధితుల కోసం భెల్‌లో విరాళాల సేకరణ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం భెల్ హెచ్‌పీవీపీ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం కర్మాగారం మెయిన్ గేటు ఎదుట కార్మికులు విరాళాలు సేకరించారు. కార్మికుల నుంచి సేకరించిన నగదును బాధితుల సహాయార్థం పంపిస్తామని యూనియన్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ తెలిపారు.

పెందుర్తిలో భూ మాయ



- ఇతరుల స్థలాన్ని సొసైటీదిగా చూపి రూ.కోటీ 20 లక్షలకు టోకరా వేసిన అక్రమార్కులు
- సీపీని ఆశ్రయించిన బాధితులు
- పదిమందిపై కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు

బాధితులకు చూపించి మోసగించిన పెందుర్తి మండలం సత్తివానిపాలెంలోని స్థలమిదే..

పెందుర్తి, సెప్టెంబరు 5: పెందుర్తి మండలంలోని సత్తివానిపాలెంలో భూ మాయ వెలుగు చూసింది. ఇతరులకు చెందిన భూమిని సొసైటీకి చెందిందని నమ్మబలికి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసి రూ.కోటీ 20 లక్షలకు టోకరా వేశారు. కొనుగోలుదారులు ఆ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, అది వేరొకరి ఆధీనంలో ఉందని తెలియడంతో ఖంగుతిన్నారు. దీంతో తాము మోసపోయామంటూ బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దీనిని సీపీ పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడంతో భూ మోసానికి పాల్పడిన పదిమందిపై కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.రామకృష్ణ, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెందుర్తి సమీపంలోని గవరజగ్గయ్యపాలేనికి చెందిన కాండ్రేగుల సత్యనారాయణ వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. ఆయన తమ బంధువు టి.చలపతిరావుతో కలిసి కనస్ట్రక్షన్స్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 2019లో శాతవాహన కో-ఆపరేటివ్ సొసైటీ పేరిట దొడ్డి సూర్యారావు, మారిశెట్టి పెద్ద మల్లెపూవులను వారు కలిశారు. తమ సొసైటీకి సత్తివానిపాలెంలో సుమారు ఎనిమిది ఎకరాల స్థలం ఉందని, బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే విక్రయిస్తామని సత్యనారాయణ, చలపతిరావులను వారు నమ్మించారు. సత్తివానిపాలెంలో సర్వే నంబర్ 325-12లో 8.73 ఎకరాల స్థలంలోని 3.20 ఎకరాలను రూ.1.20 కోట్లు చెల్లిస్తే కోర్టు ద్వారా సొసైటీకి దఖలు పడిన ఈ స్థలాన్ని సొసైటీ సభ్యులే జీపీఏ చేసి, రిజిస్ట్రేషన్ జరిపి విక్రయిస్తారని చెప్పడంతో పాటు సదరు మొత్తం స్థలం ఉమ్మడి లేఅవుట్ నిర్మాణంలో 40:60 నిష్పత్తిలో వాటాలు దక్కుతాయన్నారు. దీంతో సత్యనారాయణ తమ ఇంటిని తనఖా పెట్టడంతో పాటు కొంత నగదు అప్పు చేశారు. ఆయన భాగస్వామి చలపతిరావు కూడా నగదు సర్దుబాటు చేయడంతో బ్యాంక్ చెక్కుల ద్వారా రూ.80 లక్షలు, నగదుగా రూ.40 లక్షలను దొడ్డి సూర్యారావుకు అందజేశారు. ఈ మేరకు గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సత్యనారాయణ పేరిట 1.60 ఎకరాలు, చలపతిరావు పేరిట 1.60 ఎకరాలను రెండు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తవ్వడంతో సత్యనారాయణ లేఅవుట్ వేసేందుకు సత్తివానిపాలెంలోని స్థలం వద్దకు వెళ్లారు. అప్పుడు ఈ స్థలం సొసైటీది కాదని, దాడి శ్రీరామకృష్ణ, వారి కుటుంబ సభ్యులకు చెందినదిగా గుర్తించారు. తప్పుడు పత్రాలతో తమకు ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారని, తమకు తెలియకుండానే జీపీఏ డాక్యుమెంట్‌ను రద్దు చేసినట్టు తెలుసుకున్నారు. ఈ మోసంపై సొసైటీ ప్రతినిధులను సంప్రదించగా, తాము పలుకుబడి గల వ్యక్తులమని ఎదురుదాడికి దిగడంతో సత్యనారాయణ జూలై 29న సీపీని ఆశ్రయించారు. ఫ్రీ లిటిగేషన్ ఫోరం ద్వారా ఈ కేసును పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ విచారణలో భూ మోసం జరిగినట్టు తేలింది. ఈ మేరకు దొడ్డి సూర్యారావు, కర్రి గణేశ్వరరావు, మారిశెట్టి పెద్దమల్లెపూవు, శరగడం నాగ అప్పారావు, గణేశ్, సూర్యనారాయణ, సత్యనారాయణ, సన్యాసిరావు, శ్రీనివాస్, పెంటయ్యనాయుడులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఇంట్లోకి వచ్చిన వరద నీరు

మల్కాపురం, సెప్టెంబరు 5: గ్రేటర్ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో ఓ ఇంట్లోకి వరద నీరు చేరింది. గుల్లలపాలెం గెడ్డ ద్వారా ప్రవేశించే వరద నీరు కోరమాండల్ కంపెనీలో ఉన్న కాలువ ద్వారా సముద్రంలోకి కలవాలి. అయితే కోరమాండల్ యాజమాన్యం కాలువ ముందు భాగాన్ని బాగా కుదించేయడంతో వరద నీరు కాలువలోకి వెళ్లడం కష్టంగా మారింది. దీంతో శ్రీరామ్‌నగర్‌లోని ఇంట్లోకి నీరు వచ్చింది. కోరమాండల్ యజమాన్యం తప్పుడు నిర్ణయం వల్లే ఈ పరిస్థితి నెలకొందని టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాక మహిళా చైతన్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఇస్లాంపేట హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం జి.ప్రమీల, మానవతా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దీనంకొండ కృష్ణంరాజు, స్టీల్‌ప్లాంట్ సృష్టి స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏయూ సైకాలజీ విభాగాధిపతి ఎంవీఆర్.రాజు, డైరెక్టర్ సుశీలరాణి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠాలను బోధించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. పినమడక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్రం జంక్షన్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి కార్యదర్శి జి.హేమచంద్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టేవాడే గురువు అని గాయత్రి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి ప్రగడ రాజగణపతి అన్నారు. శ్రీనగర్‌లోని టీఎస్సార్ టీబీకే, యాపిల్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంతో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ప్రిన్సిపాళ్లు ఎస్.విష్ణువర్ధన్, పమీలాముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కణితి హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కేక్ చేసి మాట్లాడారు. హెచ్ఎం బి.సూర్యప్రకాశ్ ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ అధ్యక్షుడు ఎ.మురళీధర రెడ్డి కణితి హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. 70వ వార్డు శ్రీనివాసనగర్‌లో ట్వింకిల్ స్కూల్‌లో డైరెక్టర్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ కరుణకుమారి ఆధ్వర్యంలో, శ్రీసాయి విద్యానికేతన్‌లో డైరెక్టర్ నాగుల రవికుమార్ ఆధ్వర్యంలో, శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ లలిత కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆర్పీపేట (కంచరపాలెం): అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రదమైనదని గోపాలపట్నం ఎంఈవోలు ఎ.సోమేశ్వరరావు, డి.దివాకర్‌లు పేర్కొన్నారు. మండలంలో 32 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారికి అవార్డులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. మర్రిపాలెం జ్యోతినగర్‌లో గల మండల వనరుల కేంద్రంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. వివిధ యూనియన్ల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: భారత మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నరవలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపగుంట/ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి శాంతినగర్‌లోని తమ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం భాష్యం స్కూల్‌లో విద్యార్థినులు చీరలు ధరించి ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 5: కూర్మన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా శాతవాహన నగర్ 1-9 రోడ్లు, ముస్తఫా జంక్షన్, భరత్ నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీ నగర్, అశోక్ నగర్, శివాజీ నగర్, రేడియో స్టేషన్ రోడ్డు, శివసాయి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

వేపగుంట: ఇక్కడి విరాట్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ డీవీ రమణమూర్తి తెలిపారు. ఈ కారణంగా విరాట్‌నగర్, దుర్గానగర్, గౌతమ్‌నగర్, సాయిమాధవనగర్, కృష్ణానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పెందుర్తి, సెప్టెంబరు 5: పెందుర్తిలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి, పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెం, కుమ్మర కాలనీల్లో విద్యుత్ స్తంభాలపై తాటిచెట్లు విరిగిపడడంతో అవి నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో పాటు రహదారికి అడ్డంగా స్తంభాలు పడిపోవడంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం ఈపీడీసీఎల్ ఏఈ బి.రవి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాలు, చెట్లను క్రేన్ సహాయంతో పక్కకు తీశారు. నేలకొరిగిన, విరిగిపడిన ఆరు స్తంభాల స్థానంలో కొత్తవి వేసి విద్యుత్ తీగలను సరిచేసి మరమ్మతులు చేశాక సరఫరాను పునరుద్ధరించారు.



కూలిపోయినల స్తంభాలు, చెట్లు

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 50, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 42, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 22, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 48, కంద 54, దేముడుచిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

పలుచోట్ల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

పెందుర్తి, సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ఆర్థిక సహకారంతో శరగడం యువసేన ఆధ్వర్యంలో గురువారం పెందుర్తిలో రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పాత పెందుర్తిలోని శరగడం నివాస్ వద్ద శరగడం చిన అప్పలనాయుడు ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ యువత సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దొడ్డి శివ, శరగడం బుజ్జి, ఎం.శ్రీను, ఎస్.గణేశ్, ఓకే రాజు, డి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76 వార్డు పరిధి రామాలయం వద్ద గురువారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీని చేపట్టారు. స్థానిక నాయకుడు తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ప్రజలకు వినాయక ప్రతిమలను అందజేశారు. నడుపూరు గ్రామ పెద్దలు మంత్రి శంకర నారాయణ, ఎం.అచ్చింనాయుడు, నీరుకొండ రామచంద్రరావు, టి.సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 61వ వార్డు రామకృష్ణానగర్ కార్పొరేటర్ కొణతాల జగన్మోహన్ సుధ, మల్కాపురం సీఐ విద్యాసాగర్ మట్టి వినాయక విగ్రహలను పంపిణీ చేశారు. అందరూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని వారు కోరారు.

వేపగుంట: గ్రేటర్ 98వ వార్డు సింహపురి కాలనీలో స్థానిక నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణు ఆధ్వర్యంలో మట్టి గణేశుల విగ్రహాలను పంపిణీ చేశారు.

'ఉక్కు'ను ఆదుకోవాలని మంత్రిత్వశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 5: స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని, ముడిసరకుల కొరతను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ చైర్మన్ నరేంద్రకుమార్ బంచోర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ నరేంద్రసింగ్‌లతో కలిసి గురువారం ఢిల్లీలో ఉక్కు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పాండ్రిక్, స్టీల్‌ప్లాంట్ బోర్డు సభ్యుడు సంజయ్‌రాయ్‌లను కోరారు. పోర్టులో నిలిచిపోయిన బొగ్గును విడిపించేందుకు ఆర్థిక సహాయం చేయాలని, ప్లాంట్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సెయిల్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని ప్రసాద్ తెలిపారు.

షెడ్డును కూల్చేశారని తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు

పెందుర్తి, సెప్టెంబరు 5: అడిగినంత డబ్బులు ఇవ్వలేదని తాము నివసిస్తున్న షెడ్డును కూల్చేశారంటూ బాధితుడు అత్తిలి శ్రీనివాసరావు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ సుజాత నగర్ సమీపంలోని బర్మన్ నగర్‌లో ఎనిమిదేళ్లుగా పాకలో కుటుంబంతో ఉంటున్న తాను ఇటీవల షెడ్డును నిర్మించుకున్నానన్నారు. అయితే కొంతమంది పెద్దలు తాము అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో తమ షెడ్డును కూలివేశారని, దీనిపై తహసీల్దార్ కార్యాలయంలో, పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. కాగా శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఎల్.రామకృష్ణ గురువారం తెలిపారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

గాజువాక, సెప్టెంబరు 5: విద్యార్థుల భవిష్యత్తుకు జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, నోవెల్ ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలలో పాల్గొని ఉద్యోగాలు సాధించిన వారికి గురువారం నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం ఇలాంటి జాబ్ మేళాలను మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

రాయనపాడు స్టేషన్‌లో హాల్ట్ తొలగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 5: భారీ వర్షాల కారణంగా రాయనపాడు స్టేషన్ వద్ద నీరు నిలిచిపోవడం, ట్రాక్ దెబ్బతిన్న నేపథ్యంలో పలు రైళ్లకు రాయనపాడు స్టేషన్‌లో హాల్ట్‌ను తాత్కాలికంగా ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.గురువారం విశాఖ నుంచి మహబూబ్ నగర్ వెళ్లే 12861 నంబరు గల ఎక్స్‌ప్రెస్, మహబూబ్‌నగర్ నుంచి విశాఖ వచ్చే 12862 నంబరు గల రైలు, నాందేడు నుంచి విశాఖ వచ్చే 22812 నంబరు గల రైళ్లు రాయనపాడు స్టేషన్‌కు వెళ్లవని పేర్కొన్నారు.

మత్స్య ఎగుమతులపై నేడు సదస్సు

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు పెంచడానికి గల అవకాశాలపై చర్చించేందుకు వాటాదారులతో శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ గురువారం తెలిపారు. మత్స్యకారులు, చేపల పెంపకందారులు, ఎగుమతిదారులు, పరిశోధకులు, విధాన రూపకర్తలతో వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సదస్సుకు కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, సహాయమంత్రి జార్జ్ కురియన్‌లతో పాటు మత్స్య శాఖకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.









విశ్వనాథం దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థి ఉన్నతిని కోరుకునేది గురువే

సీతమ్మధార, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా గురువారం అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువు లేని విద్య రాణించదని, ప్రతీ విద్యార్థి తమ కంటే గొప్ప వారు కావాలని ఉత్తమ గురువులు కోరుకుంటారని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ అంబేద్కర్, అబ్దుల్ కలాం ప్రపంచ మేధావులు కావడానికి వారి గురువులే కారణమని తెలిపారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఈశ్వరమ్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ గిరిష్ కుమార్, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. మంజులను అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ మంజుల మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికను అలవరచుకుని, శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: స్థానిక 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంఎన్‌వీ విశ్వనాథం, మరో తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస, సీతమ్మధార ఎంఈవోలు రామారావు, బాలామణి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. భవిత కేంద్రంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు.

డాబాగార్డెన్స్ : జిల్లా స్థాయి గురు పూజోత్సవంలో జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్ రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్‌ను జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

అల్లిపురం: అల్లిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో రైల్వేస్కూల్, విజ్ఞాన భారతి, అంగన్వాడీలలో బోధిస్తున్న సుమారు 30మంది టీచర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి టూటౌన్ సీఐ తిరుమలరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబరు గంట్ల శ్రీనుబాబు హాజరై సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక జూబ్లీ పాఠశాలలోనూ, జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో అధ్యాపకులను ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ సన్మానించారు.

ఆర్పీపేట (కంచరపాలెం): ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని, అవార్డులు మరింత బాధ్యత పెంచుతాయని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారులు ఎ.సోమేశ్వరరావు, డి.దివాకర్ పేర్కొన్నారు. మండలంలో 32 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. మర్రిపాలెం జ్యోతినగర్‌లో గల మండల వనరుల కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో మండల ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు. ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ప్రిన్సిపల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐల్లో గురువులను ఘనంగా సత్కరించారు.

పూర్ణామార్కెట్: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని, ఉపాధ్యాయులను సత్కరించడం గొప్ప విషయమని దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. గ్రేటర్ 35వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు

వరద బాధితులకు రూ.30 లక్షల విరాళాలు

మహారాణిపేట, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖ వాల్తేర్ క్లబ్ సభ్యులు, ఎస్ కోట నియోజకవర్గంలోని వివిధ విద్యా సంస్థలు, ఇతర సంస్థలు రూ.21,87,116 లక్షలు విరాళంగా ప్రకటించాయి. సంబంధిత చెక్కులను విశాఖ ఎంపీ శ్రీభరత్, ఇతర టీడీపీ నాయకులు, వాల్తేర్ క్లబ్ సభ్యులు గురువారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలసి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు గండిబాబ్జి, పట్టాభిరామ్, గంపకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: సీఎం సహాయ నిధికి వీఎంఆర్‌డీఏ, వీకేపీసీపీఐఆర్-యుడీఏ ఉద్యోగులు ఒకరోజు బేసిక్ పే మొత్తం రూ.6.76 లక్షలను విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కమిషనర్ విశ్వనాథన్‌కు సెక్రటరీ కీర్తి అందజేశారు. అలాగే వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఈవో లక్ష్మారెడ్డి, సీఈ భవానీశంకర్, సీఏవో హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డుకు చెందిన బమ్మిడిపాటి కల్యాణి తన వంతు సాయంగా రూ. లక్ష చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని. వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌కు అందజేశారు.

అల్లిపురం: వరద బాధితులను ఆదుకునేందుకు విశాఖ జిల్లా సీపీఐ తరఫున తొలివిడతగా రూ.లక్ష సేకరించి రాష్ట్ర కార్యవర్గానికి పంపినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. నగరంలోని పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల నుంచి విరాళాలు సేకరించామన్నారు.

ఉక్కుకు మరిన్ని చిక్కులు

... 5వ పేజీ తరువాయి

యార్డులను చూసి నివ్వెరపోయారు. ఇంత ఖాళీ యార్డులతో ప్లాంటును ఎలా నడుపుతున్నారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేసి వెళ్లిపోయారు. బొగ్గు కొరత కారణంగా ఒకటో నంబరు బ్లాస్ట్ ఫర్నేస్‌ను చాలా రోజుల క్రితమే పూర్తిగా మూసేశారు. గత 15 రోజుల నుంచి కొన్ని రోజులు బీఎఫ్-2, మరికొన్ని బీఎఫ్-3 నడుపుకుంటూ వస్తున్నారు. గత రెండు రోజుల నుంచి బీఎఫ్-2 కూడా షట్‌డౌన్ చేశారు. ఇప్పుడు బీఎఫ్-3 ఒక్కటి నడపడానికి కూడా బొగ్గు పూర్తిగా లేదు. కేవలం 36 గంటలు దానిని నడపడానికి సరిపడా బొగ్గు మాత్రమే ఉంది. ఈలోగా ఏమైనా సర్దుబాటు కాకపోతే ప్రమాద ఘంటికలు మోగినట్టేనని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వైసీపీ నేతల డ్రామా

... 5వ పేజీ తరువాయి

చుట్టుముట్టారు. అయినప్పటికీ కౌన్సిల్‌లో వైసీపీకి సంఖ్యాబలం ఉండడంతో మేయర్ ఏకపక్షంగా తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం యూజర్ చార్జీలు వసూలు బాధ్యతను వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. కొన్నిచోట్ల సామాజిక పెన్షన్ల నుంచి యూజర్ చార్జీలను మినహాయించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విసిగిపోయిన జనం ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించారు. నగర పరిధిలో వైసీపీకి ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కలేదు. ఇక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా చెత్త పన్ను రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల పదో తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయాలని కూటమి ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఆ మేరకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ విషయం వైసీపీ నాయకులు తెలుసుకున్నట్టున్నారు. ఆస్తిపన్నును తిరిగి పాతవిధానంలోనే వసూలుచేయడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని, చెత్త వసూలుపై యూజర్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ జీవీఎంసీలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు గురువారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకుల పోకడలు చూసి నగరవాసులు విస్తుపోతున్నారు. పన్నుల పెంపుతో ప్రజలు ఇబ్బందిపడుతున్న విషయం అధికారం కోల్పోయిన తరువాత గుర్తొచ్చిందా?...అని ప్రశ్నిస్తున్నారు.

కదలని ఏసీపీ

... 5వ పేజీ తరువాయి

నగరానికి వచ్చినప్పుడు సదరు ఏసీపీ కనిపించగా సీపీ శంఖబ్రతబాగ్చి 'ఇంకా ఎందుకు రిలీవ్ కాలేదంటూ' ప్రశ్నించినట్టు పోలీసులు చెబుతున్నారు. అయినప్పటికీ సదరు ఏసీపీ మాత్రం నగరంలోనే కొనసాగేందుకు తన వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. బదిలీ అయినప్పటికీ తాను ఇక్కడే కొనసాగుతానంటూ తన సబ్‌డివిజన్ పరిధిలోని వ్యాపారుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీపీ శంఖబ్రతబాగ్చి ఇప్పటికైనా ఆయనపై దృష్టిసారించాలని సిబ్బంది కోరుతున్నారు.

'బే వాచ్'లో అనధికార కాటేజీలు

... 5వ పేజీ తరువాయి

బెడ్లు వేసి, రోజుకు రూ.4వేలు చొప్పున పర్యాటకులకు అద్దెకు ఇస్తున్నట్టు విచారణలో తేలిసింది. ఆ గదుల కోసం అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్టు బయటపడింది. ఏపీటీడీసీ ఇచ్చిన నిర్మాణాల కంటే రెట్టింపు సంఖ్యలో అనధికార నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. అదే విధంగా మద్యం విక్రయాల కోసం ఏపీటీడీసీ లైసెన్స్ తీసుకుంటే కేవలం రూ.6 లక్షలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. అదే లీజుదారులు తీసుకుంటే రూ.70 లక్షలకు పైగా కట్టాలి. అందుకని ఏపీటీడీసీయే లైసెన్స్ తీసుకుంది. కానీ మద్యం విక్రయాలు మాత్రం లీజుదారులు చేస్తున్నారు. ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా పర్యాటక శాఖాధికారిణి వాటి ఫొటోలు తీసుకొన్నారు. అన్నింటిని నివేదికలో పొందుపరుస్తామని ఫిర్యాదీకి తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, సెప్టెంబరు 5: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ సత్యం ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామాటాకీస్ తులసిపేట, వినాయక్ నగర్, అంబేడ్కర్ భవన్, బుల్లయ్య కళాశాల, స్పెన్సర్ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతం, డీఎంహెచ్ఓ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మహారాణిపేట, సెప్టెంబరు 5: మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మైలుపల్లి లక్ష్మణరావు అన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మత్స్యపరిశ్రమకు జవసత్వాలు కల్పించి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. మత్స్య పరిశ్రమకు రావలసిన రాయితీలు వేట సాగిస్తున్న బోట్లకు రక్షణ పరికరాలు సమకూర్చటం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించేందుకు పాటుపడతామని తెలిపారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా సురపతి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా గరికిన పరశురాముడు, మన్నెం బాలాజీ, వాసుపల్లి రాజు తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలా గురువులు, పి.సి.అప్పారావు, పేర్ల విజయ్‌చందర్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.

జీతం బకాయిల చెల్లింపునకు డిమాండ్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 5: తమ నాలుగు నెలల జీతం బకాయిలు చెల్లించాలంటూ ఘోషాస్పత్రి వద్ద సెక్యూరిటీ గార్డులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జీతాలు సక్రమంగా అందక సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను నడపడం దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. నిబంధనల ప్రకారం రూ.12 వేలు ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ రూ.9 వేలు మాత్రమే చెల్లించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

విశాఖ జిల్లాలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 5 : జిల్లాలోని క్వారీ రీచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం కార్యదర్శి కర్రి వెంకటరమణ, అధ్యక్షుడు మద్దిల వెంకట రమణ, కోశాధికారి నమ్మి మాధవరావు కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుమారు వెయ్యి లారీలతో ఇసుకను రవాణా చేస్తూ పది వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ఐదు నెలలుగా శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇసుక రీచ్‌లు ప్రారంభించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారులు, లారీ యజమానులకు ఇసుక పంపిణీ విధానం ప్రభుత్వం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు బొట్టా సురేష్, కొయ్య శ్రీను, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

9న నీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదిన టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్లు, లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు తెలిపారు. యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని తాగునీటి సరఫరా, యూజీడీ, పంప్‌హౌస్‌లతోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అన్‌స్కిల్డ్ వారికి నెలకు రూ.25,410, సెమీ స్కిల్డ్ వారికి రూ.29,610 వేతనం చెల్లించేలా గత ఏడాది కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. తొమ్మిది అధికారుల కమిటీ కూడా ప్రజారోగ్యం విభాగంలో పారిశుధ్య సూపర్‌వైజర్లు, వర్కర్‌కమ్ డ్రైవర్లుని వివిధ కేటగిరీలుగా విభజించి వారికి వేతనాలను కూడా నిర్ణయిస్తూ నివేదిక అందజేసినా ఫలితం లేదన్నారు.

'దేశానికే ఆదర్శం కేరళ వామపక్ష ప్రభుత్వం'



ప్రసంగిస్తున్న కేరళ మాజీ మంత్రి శైలజ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 5 : దేశానికే కేరళ వామపక్ష ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిందని ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ కేకే శైలజ అన్నారు. 'కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఐఎం జిల్లా కమిటీ నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా ఆమె విచ్చేశారు. తొలుత తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు రుద్రరాజు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేరళలో కోవిడ్ సమయంలో వామపక్ష ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో తీసుకున్న వైఖరి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు పొందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వామపక్ష పార్టీలను, ప్రభుత్వాలను కూల్చడమే లక్ష్యంగా చేసుకుందన్నారు. త్రిపుర, బెంగాల్‌లో నేడు వామపక్ష ప్రభుత్వాలు లేకపోవడంతో అక్కడ ప్రజలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో చూస్తున్నామన్నారు. పోలీస్ బలగాలతో ప్రజలను, పోరాటాలను అణిచి వేస్తున్నారని ఆరోపించారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి డా.బి.గంగారావు అధ్యక్షత వహించిన సమావేశంలో కార్యదర్శి జగ్గునాయుడు, ప్రభావతి, కుమార్, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

వినియోగదారుల్లో చైతన్యం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ దాశరథి

మురళీనగర్, సెప్టెంబరు 5 ; విద్యార్థుల నుంచి సాధారణ పౌరుల వరకు తమ హక్కుల పట్ల సరైన అవగాహన ఉండాలని సీఐ దాశరథి సూచించారు. వినియోగదారుల హక్కుల కమిషన్ మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి వస్తువు, ఆహార పదార్థాల్లో కనిపిస్తున్న నకిలీ ఉత్పత్తులు, నాణ్యత లేమి విషయంలో ప్రశ్నించాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు పొందాలంటే వినియోగదారుల్లో చైతన్యం అవసరమన్న ఫోరం ప్రతినిధుల సూచనలు పాటించాలన్నారు. తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ విద్యార్థులకు ప్రాథమిక అవగాహన సూత్రాలు తెలిపారు. ప్రిన్సిపల్ రాజేష్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్స్ ఫోరం నుంచి ఇక్బాల్, శరత్‌చంద్ర, విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

మర్రిపాలెం, సెప్టెంబరు 5: చిన్నారుల ఆరోగ్యంపై అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. గురువారం ఆయన గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్‌దరి శ్రీరామ్‌నగర్‌లోని శిశుగృహ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ రమణకుమారి, శిశుగృహ మేనేజర్ సుజాత, ఎంఎస్‌కె రాజన భవాని పాల్గొన్నారు.

'మాల మాదిగలు కలిసి ఉండాలన్నదే లక్ష్యం'

మహారాణిపేట, సెప్టెంబరు 5: మాల మాదిగలు కలసి ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ విశ్వ విద్యాలయం మాజీ డీన్, దక్షిణ భారత సిద్ధాంత కర్త గాలి వినోద్ కుమార్ అన్నారు గురువారం సమావేశమందిరంలో బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధమేనా? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తొలుత డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ దళితుల సమస్య పరిష్కారం కాకూడదనేదే రాజకీయ పార్టీల ఆలోచన అని మండిపడ్డారు. వర్గీకరణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమస్య అని, కులాల మధ్య వ్యత్యాసం లేదని అన్నారు. సమస్యపై ముఖ్యమంత్రులిద్దరు 371 డి ప్రకారం జోన్‌డిలో పెట్టాలని కేంద్రానికి సిఫారసు పంపితే సరిపోతుందన్నారు సుప్రీంకోర్టుది తీర్పు కాదని లోటు పాట్లు ఉన్నాయని, ఇది బీజేపీ ఆర్ఎస్ఎస్ కుట్ర అని అన్నారు అంబేద్కర్ విధానానికి వ్యతిరేకంగా వెళ్లటం సరికాదన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు హరిబాబు, రాజేంద్ర, రేణుకుమార్, వేణుగోపాల్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

సింహాచలం, సెప్టెంబరు 5 : అడవివరంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సింహాచలం సమీపంలోని ప్రియాగార్డెన్స్‌లో మంగవిల్లి వెంకట కోటేశ్వరరావు (32) తల్లిదండ్రులు అప్పలరాజు, అరుణతో కలిసి నివసిస్తున్నాడు. అతను గోపాలపట్నంలోని ఓ జ్యూవెలరీ షాపులో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు సింహాచలం కొండపై ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తుంటారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బయటకు వెళ్తానని చెప్పి, కోటేశ్వరరావు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. గురువారం ఉదయం వరకూ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఈక్రమంలో అడవివరం నుంచి శొంఠ్యాం వెళ్లే రహదారిలో ఏఎంజీ కాలనీ వద్ద కోటేశ్వరరావుకు చెందిన బైక్ పార్కింగ్ చేసి ఉండడంతో ఆ పరిసర ప్రాంతంలో గాలించారు. రహదారికి కాస్తా దూరంలో ఉన్న చెరువులో మృతదేహం తేలియా డుతూ కనిపించడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం

గోపాలపట్నం, సెప్టెంబరు 5 : మత్స్య ఎగుమతులపై నగరంలో జరగనున్న జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రులకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గురువారం రాత్రి 8.15 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో విశాఖ చేరుకున్న కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య పశుసంవర్థక శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కు, సహాయ మంత్రి జార్జి కురియన్‌కు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ స్వాగతం పలికారు.

8న క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ శిబిరం

విశాఖపట్నం : ఈ నెల 8న ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న 37వ వార్డు సచివాలయంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం నిర్వహిస్తున్నట్టు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న 9 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు హెచ్‌పీవీ మొదటి డోసు వేశామని, 8న వీరికి రెండో డోస్ వేస్తామని పేర్కొన్నారు.

మండపాల వద్ద జాగ్రత్తలు అవసరం

మర్రిపాలెం, సెప్టెంబరు 5: వినాయక ఉత్సవాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎయిర్‌పోర్ట్ సీఐ వి.చక్రధరరావు సూచించారు. గురువారం ఎయిర్‌పోర్ట్ పరిధిలోని నిర్వాహకులతో ఓ పంక్షన్ హాల్లో సమావేశమై సూచనలు చేశారు. మండపాల వద్ద డీజే సౌండ్ వద్దని, పరిసరాలలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు.

భక్తిమాల పుస్తకావిష్కరణ

సీతంపేట, సెప్టెంబరు 5 : ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సర్వేజనా సుఖినోభవంతు ఆధ్వర్యంలో రచయిత నారాయణం వరలక్ష్మి రచించిన భక్తిమాల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలబాట సంపాదకులు, తెవివి బాలసాహిత్య పురస్కార గ్రహీత స్వరాజ్యం వెంకట రమణమ్మ భక్తిమాల పుస్తకాన్ని ఆవిష్కరించి పుస్తకంలో అంశాలను వివరించారు. పుస్తక రచయిత, విశిష్ట అతిథిగా విచ్చేసిన నారాయణం వరలక్ష్మి భక్తి సాహిత్యం, భక్తి గీతమాలిక రచన పుస్తక విశిష్టత తెలిపారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.విజయలక్ష్మి, సత్య మాధవి, తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లా త్రోబాల్ జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 5: జిల్లా బాలురు, బాలికల త్రోబాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 8న ఏవీఎన్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు త్రోబాల్ సంఘం కార్యదర్శి జి.గోపీకృష్ణ తెలిపారు. పాల్గొనదలచినవారు 2006 జనవరి 1న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఔత్సాహికులు 8న ఉదయం 9 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గోపీకృష్ణ ఫోన్: 93939 96660, అప్పలరాజు ఫోన్: 83285 84718 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి సంపత్ వినాయగర్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

సిరిపురం, సెప్టెంబరు 5 : సిరిపురంలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈఓ కె.శిరీష తెలిపారు. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ప్రతిరోజూ అభిషేకం చేయించుకోదలచిన భక్తులు ముందుగా రూ.2,500 చెల్లించి, గోత్రనామాలు నమోదు చేసుకుని రశీదు పొందాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, సెప్టెంబరు 5 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడపశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్యం కల్యాణం సంప్రదాయబద్ధంగా జరిపారు.

'పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలి'

వెంకోజీపాలెం, సెప్టెంబరు 5 : జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో ఉన్న పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం వారు భానునగర్‌లోని లాజరస్ చర్చిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీ ఎంసీ ఉన్నతాధికారులు పార్కు స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడేలా కల్యాణ మండపం లేదా కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు.ఈ విషయమై జీవీఎంసీ కమిషనర్‌ను, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మిని కలవనున్నట్టు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన

ఆనందపురం, సెప్టెంబరు 5 : మండలంలోని తర్లువాడ పంచాయతీలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి అప్పలస్వామి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటల దిగుబడిపై ఆరా తీశారు.

పీఎంపాలెం సీఐగా బాలకృష్ణ

కొమ్మాది, సెప్టెంబరు 5 : పీఎంపాలెం సీఐగా బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రేంజ్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

'సభ్యత్వాల నమోదుతో పార్టీ బలోపేతం'

మధురవాడ, సెప్టెంబరు 5 : పార్టీ బలోపేతం కావాలంలే సభ్యులను ఎక్కువగా చేర్చుకోవాలని బీజేపీ భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కుంటుభుక్త రామానాయుడు అన్నారు. మధురవాడ మిథిలాపురి వుడాకాలనీలో గురువారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరిపల్లి అచ్చుత రామ్మోహన్, బండారు అనిల్‌కుమార్, పోతిన పైడిరాజు, అన్నదేవర సురేంద్రకుమార్, చోడవరపు నాగరాజు, సునీత పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 5 : పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానికుడు కర్రి శివకుమార్ గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశి, 15వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, పాఠశాల హెచ్ఎం జ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 5 : మండలంలోని దాకమర్రిలో పది రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 50, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 42, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి, 22, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 110, బరబటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయ 22, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 48, కంద 54, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 91
ఫారం ధర	-- 111
విత్ స్కిన్	-- 192
స్కిన్‌లెస్	-- 202



ఏయూలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆచార్యులు



రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నవ సమాజ నిర్మాతలు గురువులు

- ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు
- భీమిలి, తూర్పు నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు

భీమునిపట్నం,సెప్టెంబరు 5 : భీమిలి, తూర్పు నియోజకవర్గాల్లోని అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.భీమిలి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ కెమిస్ట్రీ లెక్చరర్ మీసాల ఉపేంద్ర మాట్లాడుతూ ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. అంతకముందు అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఏఎస్ జెనర్జీ, విశ్రాంత సీనియర్ ఇంగ్లీష్ లెక్చరర్ పి. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నలుగురు విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే కేజీబీవీలో స్కూల్ కమిటీ చైర్మన్ చందవరపు కుమార్, వైస్ చైర్మన్ ఇంటి రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ది సన్ స్కూల్‌లోనూ వేడుకలు నిర్వహించారు.

సింహాచలం : సింహాచలం కొండ దిగువన ఉన్న సాంస్కృతోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సింహాచలం ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు తమ్మయ్యను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టీపీ రాజగోపాల్, ఏఈఓ ఆనంద్‌కుమార్, అధికారులు రమణమూర్తి, సునీల్ పాల్గొన్నారు. అడవివరం శాఖా గ్రంథాలయంలో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, విశ్రాంత హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి, అజయ్, వి. కామేశ్వరరావు, ఎల్లమ్మ, చిన్న, భానుమూర్తి పాల్గొన్నారు.

ఆనందపురం : నవ సమాజ నిర్మాణం గురువులతో సాధ్యమని వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరి జీవితంలో అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి విజ్ఞానాన్ని నింపేవాడే గురువు అని చెప్పారు. అంతకముందు పలువురు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

తగరపువలస : చిట్టివలస ఎస్‌బీఐ సిబ్బంది సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా బంగ్లామెట్ట పాఠశాలలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, మల్లిక, నాగమణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు శ్రీనివాసరావు, సిబ్బంది లలితేష్ బాబు, రాజు, వినోద్ పాల్గొన్నారు. స్కూల్ కమిటీ సభ్యులు కూడా ఉపాధ్యాయుల్ని సన్మానించారు.

ఆరిలోవ: తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనూ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదన్నారు. అనంతరం హెచ్ఎంలు భవానీ, విశ్వనాథంను సత్కరించారు. శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం, పెదగదిలి మండల పరిషత్ పాఠశాలలోనూ వేడుకలు జరిగాయి.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని నగర పౌర శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు పి. లక్ష్మణ్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

విశాఖపట్నం : ఏయూలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సర్వేపల్లి విగ్రహానికి వీసీ శశిభూషణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇఎస్ ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు నరసింహరావు, ఎంవీఆర్ రాజు, సీతామాణిక్యం, శంకర్, పద్మశ్రీ, విజయ్ మోహన్, నాగరాజ కుమారి, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మనాభం : సమాజంలో విభిన్న రంగాలు, వృత్తుల్లో రాణిస్తున్న వారిని తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని మాజీ మంత్రి అప్పలనర్సింహరాజు అన్నారు. రెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అనంతపద్మనాభ సేవా సంస్థ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు సంయుక్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. అన్ని వృత్తుల్లోనూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. అనంతరం 20 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, అనంతపద్మనాభ సేవా సంస్థ అధ్యక్షుడు గోపీబాబు, ఎంఈఓలు రమణ, బాబూలాల్, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు. పద్మనాభం, రేవిడి, బీఆర్ తాళ్లవలస, విజయానందపురం, పాండ్రంగి, మద్ది, గంధవరం, అనంతవరం గ్రామాల్లోనూ ఉపాధ్యాయులను సత్కరించారు.



భీమిలి డిగ్రీ కళాశాలలో వేడుకలు

మద్దిలపాలెం : భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ గుర్తింపు పొందిన నైపుణ్యాలు, పాలనా సంస్థ నుంచి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు పొందిన డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబును కళాశాల సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. జయ, సిబ్బంది శ్రావణ్‌కుమార్, పి. ఉమామహేశ్వరరావు, కె. రవిబాబు, జీవీ ప్రతాప్, సామ్యూల్ డేవిడ్, బి. లక్ష్మి పాల్గొన్నారు.

రామ్‌నగర్ : బీచ్ రోడ్డులో ఉన్న ఒక హోటల్‌లో తెలుగు శక్తి ఆధ్వర్యంలో ముగ్గురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్, ఏయూ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు ఉషా కిరణ్, పోలూరు శేషమాంబ, కొల్లి రత్నకుమారి, వానపల్లి గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం రావాలి

- ఉపాధ్యాయుల దినోత్సవంలో ఎంపీ ఎం. శ్రీభరత్
- 82 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాఖపట్నం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ప్రశ్నించే తత్వం, ఆలోచనా తత్వం వచ్చేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. బట్టీ పట్టే విద్యా విధానం వల్ల విద్యార్థులలో సృజనాత్మకత, కొత్త ఆలోచనలు కొరవడుతున్నాయన్నారు. గురువారం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీభరత్ తొలుత జ్యోతి ప్రజల్వన చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీభరత్ మాట్లాడుతూ దేశంలోని యువతలో నైపుణ్యం కొరవడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదల, నాయకత్వ లక్షణాలు అలవడేలా విద్యా ప్రమాణాలు పెరగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఐదేళ్లల్లో రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు తగ్గినట్టు మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చెప్పిన విషయాన్ని ఎంపీ ప్రస్తావించారు. మంచి బోధన ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెరుగుతారన్నారు. త్వరలో విశాఖ పార్లమెంటు పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తానని తెలిపారు. మంచి ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థుల మదిలో నిలిచిపోతారన్నారు.



సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీభరత్, పక్కన కలెక్టర్, తదితరులు

మేయరు హరివెంకటకుమారి మాట్లాడుతూ దేశానికి మంచి విద్యార్థులను అందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైదన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండాలే టీచర్లు తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. తనను వేకువజాము మూడు గంటలప్పుడు టీచర్ బావి గట్టుమీద కూర్చోబెట్టి చదివించారని గుర్తు చేసుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఏ రంగంలోనైనా రాణించాలంటే అది కేవలం ఉపాధ్యాయులు అందించే విద్య ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సమగ్రశిక్షా అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, చినగదిలి ఎంఈవో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 82 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మహిళను బెదిరించిన యువకుడి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 5 : మనీ లాండరింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నారంటూ మహిళను బెదిరించి, రూ. 37 లక్షలు కొట్టేసిన కేటుగాడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...నగరానికి చెందిన మహిళకు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుంచి కాల్ వచ్చింది. మీరు సంజయ్‌సింగ్ మనీ లాండరింగ్ కేసులో ఉన్నారని,మీపై రిపోర్ట్ జనరేట్ అయ్యిందని చెప్పారు. వెంటనే న్యూఢిల్లీ పోలీస్ స్టేషన్‌కి వచ్చి సహకరించాలన్నారు. వచ్చేటప్పుడు బ్యాంక్ అకౌంట్ స్టేట్మెంట్లు తీసుకురావాలన్నారు. రాంగ్ కాల్ అని సదరు మహిళ చెప్పినా.. రిపీటెడ్‌గా కాల్ చేస్తూ వెంటనే మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని బెదిరించ డంతో భయాందోళనకు గురైన ఆమె కాల్ చేసిన వాడు ఇచ్చిన అకౌంట్‌కి రూ.37 లక్షలు పంపించారు. అదే సమయంలో సైబర్ క్రైమ్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడంతో సాంకేతికతను వినియోగించి ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ పరికరాలతో కేటుగాడు హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతానికి చెందిన రాహుల్ గిరి గోస్వామి (35)గా గుర్తించారు. అతను సైబర్ నేరగాళ్లకు అకౌంట్ నంబర్లు సప్లయి చేస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు యువకుడ్ని హైదరాబాద్‌లో అరెస్టు చేసి వైజాగ్ తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు.

మట్టి ప్రతిమలు పంపిణీ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 5 : ఎంఎంటీసీ కాలనీలో ఉన్న సత్య నేచురల్స్ స్టోర్‌లో సత్య నేచురల్స్, స్వాతి ప్రమోటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు, మొక్కలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్య నేచురల్స్ ప్రతినిధి వి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ జనరల్ మేనేజర్ లక్ష్మణ్‌రెడ్డి, సత్య నేచురల్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సత్య నేచురల్స్ ప్రతినిధులు

డాక్ యార్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 5 : తూర్పు నేవల్ కమాండ్ పరిధిలోని డాక్ యార్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈఎన్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. గురువారం వారు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సబ్బం కిరణ్‌కుమార్, మన్యాల ప్రసాద్ బాబు, పి. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.10 లక్షలు విరాళం

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి సెంచరీ ప్రతినిధులు క్లబ్ రూ. 10,00,116 ల చెక్‌ను విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ద్వారా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అందజేశారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో చెక్ అందజేసే కార్యక్రమంలో సెంచరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్. విష్ణుమూర్తి రాజు, ఉపాధ్యక్షుడు ఎంవీ. శర్మ, కార్యదర్శి వి. శ్రీమంత్, కోశాధికారి రమేష్, సభ్యులు సుభాష్‌చంద్రబోస్,కె. సురేష్, వీవీవీ. ప్రసాద్, పి. వెంకటపతిరాజు పాల్గొన్నారు.

ఏయూ ఉద్యోగులు, పెన్షనర్ల విరాళం రూ.63.59 లక్షలు

వరద బాధితులకు సాయం అందించేందుకు ఏయూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ముందుకు వచ్చారు. వర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, టీచింగ్ పెనర్స్, నాన్ టీచింగ్ పెన్షనర్స్, కాంట్రాక్ట్ టీచర్స్, మినిమమ్ టైమ్ స్కేల్ ఉగ్యోగులు తమ ఒకరోజు బేసిక్ పేను బాధితులకు విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు వీసీ శశిభూషన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయ్‌ను కలిసి ఈ వేతనాన్ని ప్రభుత్వానికి అందించాలని కోరారు. మొత్తం రూ.63.59 లక్షలను ప్రభుత్వానికి అందిస్తామని వీసీ తెలిపారు.

వరద బాధితుల సేవలో జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 5 : జీవీఎంసీ అధికారులు, పారిశుధ్య కార్మికులు విజయవాడలో ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారని కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని 64వ వార్డులో ముంపు ప్రాంతాల్లో ఆహార పొట్లాలు, మంచినీరు పంపిణీ, పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నామని చెప్పారు.

పోలీస్ క్వార్టర్లను సందర్శించిన సీపీ

పెదవాల్తేరు, సెప్టెంబరు 5 : చినవాల్తేరు పాత పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న సిబ్బంది క్వార్టర్లను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి క్వార్టర్లకి రెండు వైపుల నుంచి పైపులు వేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తగా సంపుల ఏర్పాటుకు భూమి పూజ చేశారు.

వర్షానికి కూలిన గోడ

ఆరిలోవ, సెప్టెంబరు 5 : హనుమంతవాక జంక్షన్‌లో ఉన్న కొండవాలు ప్రాంతంలో కొనేటి తాతారావు ఇంటికి అనుకొని ఉన్న గట్టు గోడ గురువారం కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోడ పూర్తిగా నానిపోవడంతో ఆకస్మాత్తుగా పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ సంఘటనా స్థలానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తహసీల్దార్‌ను ఘటనా స్థలానికి పంపించి పరిస్థితిపై సమీక్షించారు.